క్లుప్తంగా

సాయి సేవలో ఆనంద్



సాయిబాబా ఆలయంలో
పూజలు చేస్తున్న ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని ద్యాచారం గ్రామ సమీపంలోని షిరిడి సాయి బాబా ఆలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ప్రచారానికి బయలుదేరారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు

పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాచన్న



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు
చేస్తున్న రాచన్న తదితరులు

మర్పల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే పేదలకు మేలు జరుగనుందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాచన్న అన్నారు. గురువారం మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన చర్చి, మసీద్‌లో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. వికారాబాద్ ఎమ్మెల్యేగా డాక్టర్ మెతుకు ఆనంద్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ చైర్మన్ రఘుపతిరెడ్డి, మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ జైహింద్‌రెడ్డి, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అండగా నిలవండి



ప్రచారం చేస్తున్న ఉమ తదితరులు

కుల్కచర్ల: అందరికీ తోడునీడగా నిలిచే కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి కోరారు. గురువారం చౌడాపూర్ మండలం మొగుళ్లపల్లి, చాకల్‌పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతికి పాల్పడుతున్న బీఆర్ఎస్ నేతలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చాకల్‌పల్లి సర్పంచ్ రాములమ్మ, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుల్కచర్ల మండలంలోని జీతులతాండలో ఇంటింటికీ వెళ్లి హస్తం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొంరాస్‌పేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. గురువారం మండలంలోని నాందార్‌పూర్, బాపల్లి తండా, ఏర్పుమళ్ల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలోని 38 పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. విద్యుత్, దివ్యాంగులకు వీల్‌చైర్, గదులకు కిటికీలు, తలుపులు ఉండేలా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

జెడ్పీటీసీ ప్రమోదిని దేవి



కార్యకర్తలతో మాట్లాడుతున్న
జెడ్పీటీసీ ప్రమోదిని

యాలాల: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తల్లి, జెడ్పీటీసీ ప్రమోదిని దేవి జోస్యం చెప్పారు. గురువారం మండలంలోని రాఘవాపూర్, కమాల్‌పూర్, పగిడియాల, యాలాల తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో యువకులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. తాండూరు అభివృద్ధికి రోహిత్‌రెడ్డి కృషి చేశారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రోహిత్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వాస్తు.. విజయోస్తు..

- విజయానికి కలిసొస్తుందన్న నమ్మకం
- అన్ని పార్టీల పూజలు మరూ
- మదన్‌పల్లి నుంచే నేతల ప్రచారం



మదన్‌పల్లి నుంచి ప్రచారాన్ని ప్రారంభించిన పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: వాస్తు నమ్మకం ఎవరినీ వదలలేదు. ఇల్లు కట్టాలన్నా, కొత్త ఇల్లు కొనాలన్నా పక్కగా వాస్తు చూసి మరీ కొనుగోలు చేస్తుంటారు. ఇదంతా సాధారణమే. కానీ ఇప్పుడు రాజకీయ పార్టీల నేతలను కూడా వాస్తు వెంటాడుతోంది. వాస్తు, ముహూర్తం చూసి అడుగేస్తే విజయం ఖాయమనే ధీమాలో ఉన్నారు పార్టీల అభ్యర్థులు. గెలుపునకు వాస్తు కూడా కలిసొస్తుందనే నమ్మకంతో అన్ని పార్టీల నేతలున్నారు. పూజలు, బాజా భజంత్రీలుతో పాటు వాస్తుకు అనుకూలంగా ఉన్న గ్రామం, మండలాన్ని ఎన్నుకుని మరీ ఎన్నికల ప్రచారం మొదలుపెడుతున్నారు. నియోజకవర్గంలో ఈ సంప్రదాయం మూడు పర్యాయాల నుంచి ప్రారంభమైంది. ఈశాన్యం దిక్కున ఉన్న బొంరాస్‌పేట మండలం, అందులోని మదన్‌పల్లి గ్రామాన్ని నమ్ముతూ ఎన్నికల ప్రచారాన్ని షురూ చేస్తున్నారు.

మదన్‌పల్లి మహాబలం

సాధారణంగా ఇల్లు కట్టాలన్నా, వ్యవసాయ బోరు వేయాలన్నా దిక్కులను లెక్కించి వాస్తుకు ఈశాన్యం దిక్కును ఎంచుకుంటాం. కాగా రాజకీయ ఎన్నికల్లో విజయానికి ఈశాన్యం వాస్తు కలిసొస్తుందని పార్టీల నేతలు బలంగా నమ్ముతున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఎనిమిది దిక్కులకుగానూ మద్దూరు, దౌల్తాబాద్, కోస్గి, కొడంగల్, బొంరాస్‌పేట ఉమ్మడి ఐదు మండలాలున్నాయి. కొత్తగా దుద్యాల, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు ఏర్పడగా.. అందులో వాస్తుకు కలిసొస్తుందని నమ్ముకునే దిక్కు బొంరాస్‌పేట మండలానికి ఉంది. ఈ మండలంలో మదన్‌పల్లి గ్రామం ఈశాన్యంలో ఉంది. అందులోనూ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం ఈశాన్యంలో ఉంది. అందువల్ల ఎన్నికల ప్రచారానికి భగవంతుని ఆశీర్వాదంగా కూడా కలిసి వస్తుందని నమ్ముతున్నారు. అందుకు మదన్‌పల్లి మహాబలం అంటూ విశ్వాసంతో ముందుకు సాగుతున్నారు.

రేవంత్‌రెడ్డితో మొదలు

2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లి నుంచే ప్రచారానికి నాంది పలికారు. ఊహించని రీతిలో ఆయన విజయం సాధించారు. రెండో సారి కూడా ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారం షురూ చేసి గెలిచారు. దీంతో ఈశాన్య నమ్మకాన్ని అభ్యర్థులు బలంగా నమ్ముతున్నారు.

ఈ సారి బీఆర్ఎస్ షురూ

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు కూడా ఈశాన్యం వాస్తును నమ్మారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మదన్‌పల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. తన ప్రచార రథానికి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభోపన్యాసం చేశారు. అలాగే అధికారం పార్టీ నుంచి ప్రతిపక్షంలో చేరిన మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి కూడా మదన్‌పల్లి నుంచే ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. సేవలు, సంక్షేమం, అభివృద్ధి పథకాలు ఓటర్లను ఆకర్షిస్తాయి. కానీ నేతలు మాత్రం వాస్తును నమ్ముకుని బరిలోకి దిగుతున్నారు. ఈ ఎన్నికల్లో వాస్తు నమ్మకం కలిసొస్తుందో లేదో వేచి చూడాలి మరి.

బీఆర్ఎస్‌లో చేరిక

కొడంగల్ రూరల్: నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం నీటూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పట్టణంలోని మంజునాథ ఫంక్షన్‌హాల్‌లో వీరికి నరేందర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వివరిస్తూ పార్టీ గెలుపు కోసం కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు,
కార్యకర్తలతో పట్నం నరేందర్‌రెడ్డి

బీఆర్ఎస్‌ను గెలిపించండి

మోమిన్‌పేట: బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామానికి చెందిన పలువురు నర్సింహారెడ్డి సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంతో పనిచేసి పార్టీ అభ్యర్థిని గెలిపించాని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్, మొరంగపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లేశ్ యాదవ్, పాండురంగారెడ్డి తదితరులు ఉన్నారు.

అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తాం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను ఏకకాలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఎన్నికల మేనిఫెస్టోలో పొందపర్చిన రైతు డిక్లరేషన్, మహిళ డిక్లరేషన్, యువడిక్లరేషన్‌తో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యాక్షుడు ప్రభాకర్‌రెడ్డి, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు బిచ్చిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, నాగేశ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మోమిన్‌పేట: మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లి, గోవిందాపూర్, మోమిన్‌పేట గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చంద్రాయన్‌పల్లి ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి, గోవిందాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు బిచ్చయ్య, పోచయ్యలతో పాటు మోమిన్‌పేట గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, నాయకులు శుభాశ్‌గౌడు, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో

దౌల్తాబాద్: మండలంలోని యాంకి, చల్లాపూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో హస్తం తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, వీరన్న, వెంకట్‌రెడ్డి, శరణయ్య తదితరులున్నారు.

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ నాయకుడు తిరుపతి రెడ్డి మండల పరిధిలోని మెట్లకుంట, ఏర్పుమళ్ల, దుప్‌చర్ల తదితర గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు.



నాయకులకు కండువా కప్పి
పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్‌కుమార్

కాంగ్రెస్‌లోకి మంత్రి అనుచరుడు

తాండూరు రూరల్: మంత్రి మహేందర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్ కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. గురువారం మండలంలోని అంతారం గ్రామంలో డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ నేత మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో వడ్డె శ్రీనివాస్ హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు పాటు అంతారం మాజీ సర్పంచ్ వడ్డే శేఖర్ కూడా పార్టీలో చేరారు.

గడపగడపకూ కాంగ్రెస్

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్, కుదురుమళ్ల, సంగాయిపల్లి, చల్లాపూర్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గడపగడపకూ వెళ్లి ఆరు గ్యారంటీ హామీలను వివరించారు. నవంబర్ 30వ తేదీన జరిగే శాసన సభ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవంత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దస్తప్ప, అంజి, నర్సిములు, తదితరులున్నారు.

సామాన్యుడికి ఎన్నికల కష్టాలు

- కోడ్ అమలుతో తనిఖీలు
- రూ.50వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తే సీజ్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు

దౌల్తాబాద్: 'వెంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది' అని అంటారు. ఇప్పుడు రాష్ట్రంలో జరుగబోతున్న ఎన్నికలు సామాన్యుడిని అష్టకష్టాలు పెడుతున్నాయి. ఎవరి వద్దనైనా రూ.50వేలకు పైగా నగదు, 10 తులాల బంగారం పట్టుబడితే అధికారులు సీజ్ చేస్తున్నారు. కూతురు వివాహానికి బంగారం కొనడానికి వెళ్లాలంటే నాన్నకు భయం. పండగ పూటకి కుటుంబమంతా షాపింగ్‌కు వెళ్లాలన్నా జంకు. దీపావళి సీజన్‌లో వచ్చిన నగదును వ్యాపారులు ఇంటికి తీసుకెళ్లాలంటే వణుకు. ఎన్నికల తనిఖీల్లో ఎక్కడ పట్టుకుంటారనే భయం అందరిలోనూ ఉంది. ఎన్నికల్లో నగదు పంపిణీని కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో నిర్వహించే వాహనాల తనిఖీలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌తో..

నవంబర్ నెల మొదటి నుంచే శుభముహూర్తాలు ప్రారంభమవుతాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో అవసరమైన ఆభరణాలు, బంగారం కొనుగోలు కోసం నగదును తీసుకెళ్లడం ఇబ్బందికరంగా మారింది. తులం బంగారం కొనాలంటే రూ.62వేలు అవసరం, పెళ్లికి ఐదు తులాల నుంచి పది తులాల వరకు బంగారం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రూ.లక్షల్లో నగదును తీసుకెళ్తే పోలీసులు ఎక్కడ పట్టుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు. రూ.50వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తే.. ఆ మొత్తానికి సంబంధించిన వివరాలు అధికారులకు తెలపాలి. లేకుండా నగదును సీజ్ చేసే అధికారం పోలీసులకు అధికారులు ఇచ్చారు.



చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీ

వ్యాపారులకు అవస్థలు

దీపావళి సీజన్‌లో వచ్చిన నగదును వ్యాపారులు దుకాణాల నుంచి రాత్రిపూట ఇంటికి తీసుకెళ్తారు. మండలంలో మెడికల్, ఏజెన్సీలు, బంగారం, బట్టల దుకాణాలు వ్యాపారులు నగదును ఇంటికి తీసుకెళ్తారు. చెక్‌పోస్టుల వద్ద పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. భారీ మొత్తాన్ని తీసుకెళ్తున్నప్పుడు పోలీసులు ఆపితే లెక్క చూపని సందర్భంలో స్వాధీనం చేసుకుంటారని వ్యాపారులు భయపడుతున్నారు. రాజకీయ నాయకులు నగదును తీసుకెళ్తే పట్టుకోవాలే తప్పా.. సామాన్యులను ఇబ్బంది పెట్టడం సరికాదని సామాన్యులు వాపోతున్నారు.

కాలె యాదయ్య గెలుపు కోసం కృషి

నవాబుపేట: ఎమ్మెల్యే కాలె యాదయ్య గెలుపు కోసం కృషి చేస్తానని వైస్ ఎంపీపీ బందయ్య గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వలన కొంతకాలంగా ఎమ్మెల్యేకు దూరంగా ఉన్నానని, ఇప్పటి నుంచి యాదయ్య, పార్టీ కోసం పనిచేస్తానని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీని మూడోసారి అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాం రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, రంగారెడ్డి, భరత్ రెడ్డి, ఆనంద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు పాంబండ గిరి ప్రదక్షిణ

కుల్కచర్ల: ప్రతి పౌర్ణమికి నిర్వహించనున్న గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఈ నెల 28వ తేదీన (రేపు) ఉదయం 7గంటలకు నిర్వహిస్తామని కార్యక్రమ నిర్వహకుడు నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు కుట్ర



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

- పీసీసీ నాయకుడు మహ్మద్ యూసుఫ్
- తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేదిలేదు

కొడంగల్ రూరల్: కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు డబ్బులిచ్చి ర్యాలీలు నిర్వహిస్తూ.. తప్పుడు ప్రచారం చేస్తున్నారని పీసీసీ కార్యవర్గ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ మండిపడ్డారు. గురువారం పట్టణంలోని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం నుంచి పలువురు రైతులకు డబ్బులిచ్చి ర్యాలీలు నిర్వహించడం సరైంది కాదని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేదిలేదని, అందుకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగుతోందని, గులాబీ పార్టీ నాయకులకు దిక్కుతోచక కూలీలకు డబ్బులిచ్చి ర్యాలీలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణంరాజు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఉపాహారం అందించాలి

మండల విద్యాధికారి హరిశ్చందర్

పరిగి: మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు మెనూ ప్రకారం ఉపాహారం అందించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. గురువారం పరిగి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 30 ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులతో కలసి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాహార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిశ్చందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించి.. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్

బంట్వారం: విద్యార్థుల కోసం సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని సర్వ శిక్ష జిల్లా అధికారి రామ్ కిషోర్ తెలిపారు. గురువారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని మద్వాపూర్, మాలసోమారం, అన్నాసాగర్ ప్రాథమిక పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. త్వరలోనే అన్ని పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ పెడుతామన్నారు. మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, సీఆర్‌పీ నర్సింలు, హెచ్‌ఎంలు రాంచందర్, మహేశ్వరి, మౌనిక ఉపాధ్యాయులు శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపాహారం
అందజేస్తున్న హరిశ్చందర్

కారు.. జోరు

- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్
- ఇంకా ప్రారంభించని కాంగ్రెస్ అభ్యర్థి
- బీఎస్పీ పరిస్థితి కూడా అంతే
- బీజేపీలో స్తబ్దత



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మోమిన్‌పేట: గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ దూసుకుపోతోంది. అసెంబ్లీ ఎన్నికలకు నెలలసమయమున్నా అందరి కంటే ముందు ఆ పార్టీ బాస్ అభ్యర్థులను ప్రకటించడంతో నేతల్లో ఉత్సాహం నెలకొంది. వారం రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థుల ఖరారు కావడంతో ప్రచారం ప్రారంభించారు. మండలంలోని నాలుగు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు మద్దతుగా గడప గడపకు కేసీఆర్ భరోసా పేరుతో ప్రచారం చేస్తున్నారు. మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి సబిత ప్రచారం చేయనున్నారు. ఇప్పటికే గ్రామానికి ఒక ఇన్‌చార్జిని నియమించారు. ప్రచారంలో అన్ని పార్టీ కంటే గులాబీ శ్రేణులు ముందజలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ టికెట్ ఖాయమైన ఆయన ప్రచారానికి దూరంగా ఉన్నారు. కానీ హస్తంపార్టీ శ్రేణులు మాత్రం ఇంటింటికీ వెళ్లి అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. బీఎస్పీ అభ్యర్థి క్రాంతికుమార్ కూడా ప్రచారాన్ని ఇంకా మొదలు పెట్టలేదు. బీజేపీ ఇప్పటి వరకు అభ్యర్థిని ప్రకటించపోవడం గమనార్హం.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

ధారూరు: మండలంలోని లక్ష్మీనగర్‌తాండలో గురువారం బీఆర్ఎస్ నాయకుడు హఫీజ్, ధారూరు సర్పంచ్ చంద్రమౌళి ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను వివరిస్తూ.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్‌ను బలపర్చాలని, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండలంలోని కుదురుమళ్ల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే నెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణయ్య, నారాయణ తదితరులున్నారు. అలాగే మండలంలోని కుదురుమళ్ల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మెనిఫెస్టోలో ఉన్న హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. వచ్చే నెల 30న జరిగే ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, నారాయణ తదితరులున్నారు.

పులుమద్దిలో పీఆర్‌అండ్‌ఆర్‌డీ డైరెక్టర్ పర్యటన

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామంలో గురువారం పీఆర్‌అండ్‌పీఆర్ డైరెక్టర్ ఎం హనుమంతరావు సందర్శించారు. గ్రామంలో ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన పథకంలో భాగంగా పీర్లగుట్ట సమీపంలో నిర్మించిన ఊటకుంట పనులను సందర్శించి పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శేషుకుమార్, డీఆర్డీఓ కృష్ణన్, జెడ్పీ సీఈఓ సుభాషిని, హార్టికల్చర్ అధికారి చక్రపాణి, డీపీఓ తరుణ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ తులసీరామ్, ఎంపీడీఓ సత్తయ్య, వాటర్ షెడ్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్ హనుమంతరావు

హస్తం గుర్తుకు ఓటేయండి

ధారూరు: కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కుమార్తె అనన్య కోరారు. గురువారం ధారూరు మండల పరిధిలోని కుమ్మర్‌పల్లి గ్రామంలో తండ్రికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనన్య మాట్లాడుతూ మన జీవితాలు మారాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని, చేతి గుర్తుకు ఓటేసి తన తండ్రిని గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. ఈ ప్రచారంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌నాయక్, మల్లారెడ్డి, రాజేందర్, బుజ్జయ్యగౌడ్, అశోక్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న అనన్య

బీఆర్ఎస్‌కు ఎంపీటీసీ రాజీనామా

బీజేపీలో చేరుతున్నట్లు తేజస్విని ప్రకటన

నవాబుపేట: బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పులుమామిడి ఎంపీటీసీ తేజస్విని ప్రకటించారు. త్వరలోనే బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య ఒంటెద్దు పోకడలు నచ్చక పార్టీకి దూరంగా ఉన్నానని పేర్కొన్నారు. పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు లేదని విమర్శించారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌కు పంపినట్లు తెలిపారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.